# ఆ రాత్రి

"పార్వతక్కయ్యను ట్రెయిన్‌లో ఎక్కించి వచ్చారా బావగారూ ?"

వీణమీటినట్లున్న ప్రశ్న విని తలెత్తి చూచాడు విశ్వం. వరండాలో లైటు వేసి లేదు. ప్రక్కవాటాలో నుంచి వస్తున్న కొద్దిపాటి వెల్తురు మాత్రమే ప్రసరిస్తోం దక్కడ. స్తంభానికి జేరబడి, ఎడమచెయ్యి ఎత్తుగా స్తంభానికి మెలికతిప్పి, కుడి చెయ్యి నడుము వెనుకగా పెట్టుకుని నీరజ నిల్చుని ఉంది.

"నేను పలకరించకపోతే, బహుశా అలా నేరుగా తల వంచుకవచ్చి నన్ను ఢీకొనివుందురు... ... ... అవునా ?" అల్లాగే వయ్యారంగా నిల్చుని కిలకిల నవ్వుతోంది నీరజ.

"అబ్బే...ఏదో ఆలోచిస్తూ..." తడబడిపోయాడు విశ్వం. జారిన నైలాన్ పమిటి అతగాడి మతి పోగొడ్తోంది.

"ఎంతైనా భార్యావియోగం కదా ? విరహంలో ఆలోచన్లే అధికమంటారు... ఇంతకూ పార్వతక్కయ్య మళ్ళీ ఎప్పుడొస్తుందిటా ?"

"పదిరోజుల్లో......అహఁ, కాదు......పండుగెళ్ళిన మర్నాడు..."

తన తడబాటుకు తానే అసహ్యించుకున్నాడు విశ్వం.

"అంటే? మూడోరోజన్న మాట!"

"ఊఁ!"

గబగబ లోపలికి వచ్చి తలుపు వేసుకున్నాడు. తలుపవతలనుంచి నీరజ నవ్వు తెరలు తెరలుగా వినిపిస్తూ, హృదయాన్ని కలవరపెడ్తోంది. అలా నీరజ కిలకిల నవ్వుతుంటే ఎంతసేపయినా చూస్తూ విల్చోవాలనిపిస్తుంది ఏ మగాడికైనా! ఛ...ఈరోజీ ఆలోచన్లేవిటి కొత్తగా?

లైటు వేసి, డ్రెస్సు మార్చుకున్నాడు విశ్వం. ఇల్లంతా బోసిగా ఎలాగో వుంది! పార్వతి ఇల్లంతా తిరుగుతూంటే పదిమంది మనుషులున్నంత సందడిగా వుంటుంది!

కిటికీలోంచి చలిగాలి చల్లగా వీస్తోంది... ఆ గాలి సోకిన శరీరాని కేదో గుబులు రేగుతోంది! అనుకోకుండా ఆలోచనలు నీరజమీదకు పరుగెడ్తున్నాయి గుర్రాల్లా! అదుపులో పెట్టడం సాధ్యం కావటంలేదు విశ్వానికి.

పక్కవాటాలో వుండే లెక్చరర్ రామారావు భార్య నీరజ! స్త్రీలలో కొందరి శరీరతత్వం చాలా విచిత్రంగా వుంటుంది. ఇరవై సంవత్సరాలు నిండేసరికే అమ్మమ్మల్లా మారిపోతారు కొందరమ్మాయిలు! ముప్పైఐదు దాటినా, పద్దెనిమిదేళ్ళ పడుచుల్లా కళకళలాడ్తుంటారు కొంతమంది! పాతిక సంవత్సరాల నీరజ పదహారేళ్ళ నిండుజవ్వనిలా వుంటుంది... కానీ మాటలలో మాత్రం నేర్పు కొట్టవచ్చినట్లు కనబడ్తుంది...

విశ్వం, పార్వతి ఆ యింట్లో . అద్దెకు దిగిన మర్నాటి నుంచే నీరజ .పార్వతితో స్నేహం మొదలెట్టింది ... ఆ స్నేహాన్ని పార్వతి వరకే పరిమితం చెయ్యకుండా విశ్వంతో కూడా వరసకలిపేసింది.

"ఏమిటండీ బావగారూ ! బొత్తుగా అంత పరధ్యాన్నం ?" అంటుంది - తలవంచుక తన పనిలో మునిగివున్న విశ్వాన్ని తలఎత్తేలా చేస్తూ !

అంతటితో ఆగదు...ఏవేవో చర్చల్లోకి అతగాణ్ణి లాగుతుంది. పార్వతిదేమీ పట్టించుకోదు. తన పనేమిటో, తనేమిటో ! విశ్వానికి రానురాను నీరజ "ఉట్టి పెంకెపిల్ల" అనే భావన కలుగుతోంది ...

ఆరోజు...సాయంత్రం పార్వతి ఎవరింటికో పేరంటానికి వెళ్ళింది...ఒంటరిగా కూర్చుని ఏదో చదువుకుంటున్నాడు విశ్వం.

"అక్కయ్య లేదా బావగారూ?" రివ్వుమంటూ బాణంలా దూసుక వచ్చిన నీరజను చూచి చకితుడైనాడు విశ్వం...

తలంటుపోసుక వదులుగా వేసుకున్న జడా, లేత నీలం రంగు నైలాన్ చీరె, ఎర్రని బ్లౌజూ, సన్నని తిలకంతో, అపర రతీదేవిలా వుంది నీరజ !

"ఇదెప్పట్నుంచి బావగారూ ? వచ్చిన మనిషిని నిలువునా మింగే విద్య నేర్చుకుంటున్నట్లున్నారే !"

కిలకిల నవ్వుతూ, చనువుగా, ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ అడిగింది నీరజ.

సిగ్గుపడిపోయాడు విశ్వం. తను ఆమె నలా చూచినందుకుగాను - ఆమెపసిగట్టినందుకు. "అబ్బే అదేం లేదు. నీరజా! పార్వతి పేరంటానికి వెళ్ళింది...నిన్నూ పిలుస్తానం దే? నీతో చెప్పలేదా ?" అన్నాడు.

"నాతో చెప్పే వెళ్ళింది లెండి!" స్థిమితంగా అంది నీరజ.

తెలిసే వచ్చిందన్నమాట! విస్మయంగా చూచాడు విశ్వం.

"మావారు ఎవరో స్నేహితుడి పెళ్లి కెళ్ళారు! రాత్రి పొద్దుపోయే వరకు రారట! ఏమీ తోచలేదు... ఇలా వచ్చేశాను... మీరు చదివే పుస్తక మేమిటి?"

"వివేకానందుని ప్రవచనాలు!"

"వాట్ ? వివేకానందుని ప్రవచనాలు!" నీరజ ఆశ్చర్యంగా చూచింది.

"ఏం ? అంత చదవరానిపుస్తకమా ?" విశ్వానికా్స్త కోపం వచ్చింది.

"ఊహుఁ! ఈ వయసులో మనబోటి వాళ్ళం చదవ్వాలసిన పుస్తకం మాత్రం కాదు..." ఖండితంగా చెప్పింది నీరజ.

విశ్వం మాట్లాడలేదు.

"ఇలా చూడండి... ఈ పుస్తకం "A King of the Free Lovers''. పేరెంత చక్కగావుందో, పుస్తకంలోని కథా వస్తువూ, కల్పనా చాతుర్యంకూడా అంత అందంగా వున్నాయి..." టేబిల్ మీద గిరాటువేసింది నీరజ !

విశ్వం అందుకోలేదు. ఎన్నోమార్లు ఇలా ఏకాంతంగా నీరజ తనతో మాట్లాడింది. ఎన్ని విషయాలో చర్చించింది. కానీ ఈరోజంత జుగుప్సాకరంగా ఏనాడూ ప్రవర్తించలేదామె కానీ రోజురోజుకూ ఆమెలో ఏదో తీవ్రకాంక్షనుమాత్రంతను స్పష్టాస్పష్టంగా చూడగలుగుతున్నాడు.

"అదేమిటి అలా ముభావంగా వున్నారు? మీరిది చదివారా ?'' నీరజ కుతూహలంగా అడిగింది.

"ఆ! చదివాను! అందులో అందంగానీ, ఆనందంగాని నా కేమీ గోచరించలేదు! భర్తలు తమ భార్యలను పర పురుషుల కధీనం చెయ్యటం, వీరు మరోపరస్త్రీలతోవిహారించటం, అందుకుగాను ఓ సంఘాన్ని ఏర్పరచుకోవటం... ఇదే నాగరికత అనే భావం ఆ కథలో గోచరిస్తుంది... అంతకంటే, పశువుల స్వభావమే మెరుగనిపిస్తుంది నాకు...

నీరజ గాఢంగా నిట్టూర్చటం విని ఆగాడు విశ్వం... నీరజ ముఖం నల్లగా మారింది... కానీ క్షణంలో తనను తాను సంబాళించుకుంది. వెంటనే పకపక నవ్వేసింది. "భలే బావగారూ ! మీరు ఈ కాలంలో పుట్టవలసిందికాదు..."

"మరేకాలంలో పుట్టాలి?'' నవ్వుతూ అడిగాడువిశ్వం.

"కొన్ని వేల సంవత్సరాలకు పూర్వం..."

"........"

"ఋష్యశృంగునిలాటి మనిషంటూ వుంటాడా ? అనీ వాల్మీకి రామాయణంలో ఆ ఒక్క విషయం అతిశయోక్తిగా వ్రాశాడనీ అనుకునేదాన్ని బావగారూ ! కానీ ఈకాలంలోనూ ఋష్యశృంగు లున్నారని తెలుసుకున్నాను..." నీరజ లేస్తూ అంది.

"ఎలా తెలుసుకున్నావ్ ? ఎవర్నిచూచి ?" కుతూహలంగా అడిగాడు విశ్వం.

"మిమ్మల్ని చూచే" నీరజ కళ్ళలో ప్రతిఫలించిన ఎరుపుదనం క్షణకాలం వెర్రివాణ్ణి చేసింది.

"నేను ఋష్యశృంగు డంతటి మహానుభావుణ్ణి కానే!"

"ఋష్యశృంగుడికి స్త్రీపురుష భేదంకూడా తెలియదు-మీకు తెలుసు. అంతే తేడా !"

నీరజ ఎంత వేగంగా వచ్చిందో అంతటి వేగంగానూ వెళ్లిపోయింది. విశ్వం క్షణకాలం నివ్వెరపోయాడు ! ఏమిటి నీరజ ఉద్దేశ్యం ! తన పురుషత్వాన్నెంత కించపరచి. హేళన చేసి వెళ్ళిపోయింది ? ఉట్టి చేతకాని వాజమ్మ కింద జమ కడ్తోందా ? తనుమాత్రం - నీరజలాటి అప్సరస కోరి వస్తే కుంచించుకపోవటం ఎందుకు ? ఆ గులాబి బుగ్గల్ని, మెరుపు తీవెలాటి శరీరాన్ని, సన్నని ఆచ్ఛాదనలోని ఆ అందాల్ని తనెందుకు స్పృశించ లేకపోతున్నాడు ?

తన చుట్టూ ఏదో గోడవుంది! పార్వతి ఆ గోడ చుట్టూరా కాపలా కాస్తోంది... సంస్కారమే ఆ గోడ కాబోలు! ఈ గోడను తను భేదించలేడా ఒక్కసారి...ఒక్కసారి...

"బావగారూ!" తలుపు మీద దబదబ బాదుతున్న శబ్దం...ఉలిక్కిపడి లేచికూర్చున్నాడు విశ్వం. రాత్రి పది గంటలు దాటింది! ఆలోచిస్తూనే నిద్రలో మునిగిపోయాడు తను...

"ఈ రోజు పార్వతి ఊళ్ళో లేదు..." మరోసారి హెచ్చరించింది మనసు..."రామారావుకూడా ఊళ్ళో లేడు!" మరో సంగతి కూడా గుర్తుచేసింది మనసు...

"ఈ వేళప్పుడు నీరజ?" ఓ వేపు ఏదో శంక. మరో వేపు ఉత్సాహమూ, ఉత్తేజం ఉవ్వెత్తుగా లేస్తున్నాయ్!

"బావగారూ!" మెల్లిగా మంద్రంగా నీరజ పిలుపూ తలుపుమీద చప్పుడూ స్పష్టంగా వినిపిస్తున్నాయి.

వేగంగా కొట్టుకుంటున్న గుండె నదుపులో పెట్టుకుంటూ తలుపు తీశాడు విశ్వం! ఎదురుగా చూచి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

తెల్లని పాల నురగలాటి బట్టల్లో వెలిగిపోతూ నవ్వుతూన్న నీరజ!

"అబ్బబ్బ! ఎన్నిమార్లు పిలిచానో తెలుసా! చుట్టుపక్కలవాళ్లైనా పలుకుతారేమో గానీ, మీకు మాత్రం

మెలకువరాదండీ బావగారూ! చనువుగా లోపలికి వస్తూ అంది నీరజ...

అడ్డుచెప్పలేని అశక్తత ఆవరించింది...

"ఒంటరిగా పడుకునివుంటే, ఏదో పీడకల వచ్చిందండీ! భయంతో చచ్చిపోయానంటే నమ్మండి..."

ఆ భయం తాలూకు దడ గుండెల్లో ఇంకా వుందని సూచిస్తూ కాబోలు, తన గుండెకేసి చూపింది నీరజ!

ఎదురుగా ఆహ్వానిస్తున్న భువనమోహన రూపం! అడుగు ముందుకు వేశాడు విశ్వం...

ఏదో అఖాతంలో పడ్తున్నట్లు ఝల్లుమంది గుండె ...

"ఇంతవరకూ కుదుటపడలేదు!" నీరజ నవ్వుతూ దగ్గరగా వస్తుంది...

ఒక్క నిముషం మనస్సు మధించివేసి నట్లయ్యింది. విశ్వం తనవేపు చూచుకున్నాడు. తనలో ఉత్సాహం వురకలు వేస్తోంది! తన బాహువులు నీరజను పెనవేసుకోవాలని తహతహ లాడ్తున్నాయి ... ... ఆ బాహువుల మధ్యలో నీరజ... కాదు పార్వతి. ఊహుం...తన సంస్కారం నలిగిపోతూంది...దాదాపు ఇరవై ఎనిమిది సంవత్సరాలు తను పదిలంగా కాపాడుకుంటూ వచ్చిన తన సంస్కారం, వివేకం నలిగి నాశన మౌతున్నాయి...ఛీ...తన దింత బలహీనమైన మనస్సా?

"ఆడది కోరివచ్చిందినా ఇంత ఆలోచనా?" నీరజ గొంతు రహస్యంగా, చాలా దగ్గిరగా వినిపించింది. త్రుళ్ళి

పడ్డాడు విశ్వం...ఒక్కసారిగా అతగాడి మనస్సు కఠోర నిర్ణయం తీసుకుంది...అడుగు వెనక్కు వేశాడు.

"నీరజా నీకిది తగదు ... నేను పార్వతికీ, నువ్వు రామారావుకూ కాదు ద్రోహం చెయ్యటం! మన సంస్కారానికి...మన వ్యక్తిత్వాలకు...వెళ్లు...ఇక్కణ్ణుంచి వెళ్లు...,,!

"అపురూపంగా చూసుకునే శీలం ఆడదానికయినా, మగవాడికయినా ఒకటే! శీలసంపదలేని సంస్కారానికి అర్థమూ లేదు...వెళ్ళు..."

మరునిముషంలో నీరజ బైట. విశ్వం లోపలా వాళ్లిద్దరికీ మధ్యా మూసిన తలుపులూ ఉన్నాయి.

"పార్వతీ! ఆ రోజు రాత్రంతా చలించిపోయాను... ఏదీ దాచలేదు నీదగ్గర! నువ్వే శిక్ష వేసినా సిద్ధంగా వున్నాను సుమా!" పార్వతి దగ్గర పసిపిల్లవాడిలా అయిపోయాడు విశ్వం! పార్వతి నవ్వి వూరుకుంది.

"అది కాళరాత్రి పార్వతీ! కదూ?"

"ఊఁ"

చలిగాలి ఆహ్లాదకరంగా ఇద్దర్నీ స్పృశించి గిలిగింతలు పెడ్తోంది!

—* ♦ *—